RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA.

సంపుటి: 16 | సంచిక : 47 | మంగళవారం 26. 5. 2026 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్ | పేజీలు : 8 | వెల: 2.00



తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292




# త్వరలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు

8 వేల ఇందిరా స్త్రీశక్తి భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన

9 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు రూ. 10 వేల కోట్లు

హైదరాబాద్ -తెలంగాణ వాణి)

తెలంగాణలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మహిళా వారోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 8 వేల మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. "మహిళా శక్తి సూపర్ బజార్‌లో మహిళలు పెట్టుబడి పెట్టండి. నాణ్యమైన ఉత్పత్తులకు వాటిని చిరునామాగా మార్చండి. మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం గోదాములకు స్థలాలు ఇస్తాం. మహిళల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం. ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించాం. మహిళలను బస్సులకు యజమానులను చేశాం. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళల దగ్గర నుంచే మిల్లర్లు వడ్లు తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ చీరల డిజైన్లను సీఎం విడుదల చేశారు.

# తెలంగాణలో అతి తీవ్ర వడగాల్పులు.. మొదటిసారి రెడ్‌అలర్ట్ జారీ



- మరో నాలుగు రోజులపాటు ఎండల తీవ్రత
- జిల్లాల్లో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం ఉన్నాయి. వీటికి రెడ్ అలర్ట్

హైదరాబాద్:(తెలంగాణ వాణి)

ఎండల తీవ్రతకు తెలంగాణ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. తీవ్ర వడగాల్పులకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరో నాలుగు రోజులపాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. అతి తీవ్ర స్థాయిలో వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంటూ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడగాల్పులపై మొదటిసారిగా ఈ హెచ్చరిక జారీ అయింది.

అతితీవ్ర వడగాల్పులు వీచే అవకాశమున్న జిల్లాల్లో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం ఉన్నాయి. వీటికి రెడ్ అలర్ట్ జారీ అయింది. మరో 8 జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీచే వీలుంది. వీటిలో కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ ఉన్నాయి. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# హైదరాబాద్ మెట్రోకు ఆర్థిక బలం.. రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్

హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం జరిగింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు ఐఆర్‌ఎఫ్‌సీతో హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావు సమక్షంలో ఢిల్లీలో ఒప్పంద పత్రాలపై అధికారులు సంతకాలు చేశారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల పద్ధతిలో రుణ సౌకర్యం కల్పించనున్నారు.



# భూదాన్ భూముల వ్యవహారం

## ఈడీ విచారణకు ఐఏఎస్ అధికారి

హైదరాబాద్, మే 25 (తెలంగాణ వాణి)

భూదాన్ భూముల వ్యవహారంలో ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్. సోమవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. భూదాన్ భూముల వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణంలో ఐఏఎస్ అధికారిని ఈడీ విచారిస్తోంది. అమోయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో జరిగిన అక్రమ భూమి బదిలీలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. 2024లో అమోయ్ కుమార్‌ను పలుమార్లు ఈడీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా ఈరోజు(సోమవారం) విచారణకు రావాల్సిందిగా ఐఏఎస్ అధికారికి ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది. మూడు సేల్ డీడ్లు, బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలు అందజేయాలని నోటీసుల్లో పేర్కొంది. దీంతో ఈరోజు సేల్ డీడ్ వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లతో అమోయ్ కుమార్.. ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో 2023లో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. నాగారం గ్రామ పరిధిలోని భూదాన్ భూములను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 42 ఎకరాల భూమిని అక్రమంగా కట్టబెట్టి భారీ మొత్తంలో లాభాలు పొందినట్లు అమోయ్ కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే.. కలెక్టరేట్ ముట్టడిస్తాం

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ ట్రిప్పులు ఆపి..

కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచాలి



# హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్ -తెలంగాణ వాణి)

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురిసింది. దీంతో ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. గంగినేని థియేటర్ వద్ద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మెదక్ మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ర్యాలమడుగులో ఈదురుగాలుల తీవ్రతకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. మంభోజిపల్లిలో 3 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడులో ఈదురుగాలులు ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.





# ఆ స్కూల్‌ని ఓసారి సందర్శించండి

- ధాన్యం కొనుగోళ్లపై నిరంతర సమీక్ష
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీల నేతలు సీఎం రేవంత్‌తో భేటీ

హైదరాబాద్:(తెలంగాణ వాణి)

: కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీల నేతలు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై నేతలు సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వారికి వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ.. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నేతలను రేవంత్ కోరారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని.. దానిలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని తెలిపారు.

# రహదారి సమస్య తీరేను ...

# రైతుల సరసన పెద్దలు



**మెదక్ జిల్లా హావేలి ఘనపూర్ మండలం మే 25 :(తెలంగాణ వాణి ప్రతినిధి)**
అకాల వర్షానికి రైతన్న గోసకు , డంపింగ్ యార్డ్ కు , గోదాముకు రహదారి సమస్య ఎట్టకేలకు తీరేను . అకాల వర్షానికి రహదారి సమస్యతో గ్రామం నుండి చెత్తన సేకరించి డంపింగ్ యార్డ్ కు చెత్త తరలించడానికి , అలాగే గోదాములో ధాన్యాన్ని విలువ చేయడానికి రహదారి లేక ఒకవైపు రైతులు బాధలు పడుతుంటే , చెత్తను చేర్చడానికి గ్రామ కార్యదర్శి సర్పంచులు తల పగిలే సమస్యగా మిగిలిందని వాపోయారు . ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం చూపాలని తపనతో గ్రామ రైతులు , గ్రామ పెద్దలు గౌరవరం లక్ష్మీనర్సింగారావు చొరవతో గ్రామ పెద్దయిన వారి మాటకు సరసనగా నిలిచి గౌరవరం చంద్రరావు , భూపతి శ్రీనివాస్ సబ్ స్టేషన్ పక్కనుండి తమ పట్టా భూమి నుండి 15 ఫీట్ల రోడ్డు రోడ్డు కోసం రైతుల కోసం చూడక ముందుకు వచ్చి పెద్ద మనసుతో తమ భూమిని విరాళంగా వ్రాతపూర్వకంగా ఇచ్చారు . ఇట్టి సమస్యను తీర్చడానికి గ్రామ రైతులు గ్రామ పెద్దలు గౌరవరం లక్ష్మీనరసింహారావు , గౌరవరం సత్య వర్ధన్ రావు , తమ భూమిని విరాళంగా ఇచ్చిన పెద్దలు గౌరవరం చంద్రరావు , భూపతి శ్రీనివాస్ లకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు . అనంతరం యజమానులు మాట్లాడుతూ.... ఈ సమస్యకు పరిష్కారం చూపాలని మంచి ఆలోచనతో ముందుకు వచ్చాము . ఈ సమస్యను మా ద్వారా కొంచెం ప్రజలకు బాగుంటుందని దృఢ నిశ్చయంతో భూమిని విరాళంగా రాసి ఇచ్చావు కానీ గౌరవరం చంద్రరావు భూపతి శ్రీనివాస్ తెలిపారు . మాకు రైతుల కోసం చూస్తుంటే చాలా బాధగా అనిపించింది కాబట్టి ముందుకు వచ్చాం . మాకు రైతులకు సేవ చేయడం అంటే ఎంతో ఇష్టం అలాగే రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని ఒక మంచి స్ఫూర్తితో ముందుకు వచ్చాము .

# బాలానగర్ మండల్ పెద్దాయపల్లి గ్రామ సర్పంచ్ బి గాయత్రిపై ప్రజావాణిలో ఫిర్యాదు



**బాలానగర్ మే 25(తెలంగాణ వాణి ప్రతినిది)**
బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బి.గాయత్రిపై ముగ్గురు వార్డు సభ్యులు, 12 మంది గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శేరిగూడ, పెద్దాయపల్లి గ్రామపంచాయతీల అభివృద్ధి పనులకు సర్పంచ్ తీర్మానం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. ఫిర్యాదుదారుల వివరాల ప్రకారం, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందు పెద్దాయపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం రూ.50 లక్షల నిధులు కేటాయించారని తెలిపారు. అప్పట్లో స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి అనుమతులతో రూ.26 లక్షల విలువైన పనులు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. అయితే గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం బి. గాయత్రి సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత మిగిలిన రూ.24 లక్షల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. గత ఆరు నెలలుగా తీర్మానం చేయకపోవడంతో నిధులు విడుదల కాక అభివృద్ధి పనులు ఆగిపోయాయని తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళా వారోత్సవాలు



**కరీంనగర్:మే 25 (తెలంగాణ వాణి)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా చేప ట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కళా భారతి లో -మహిళా వారోత్స వాలు న్యూట్రిషన్ మిషన్ థీమ్ తో కార్యక్రమం నిర్వ హించడం జరిగినది.ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లా డుతూ అంగన్వాడీ,మెప్మా, మున్సిపల్ డిపార్ట్మెంటు చేస్తున్న ఆక్టివిటీస్ చాలా బాగా ఉన్నాయని ప్రజలకు ఎంత గానో లబ్ధి చేకూరుతుం దో వివరించారు.ప్రజలందరు ప్రభుత్వ సేవలను పొందాలని అన్నారు.మహిళలు తమ ఆరోగ్య పట్ల శ్రద్ధ చూపాలి మహిళలు ఆరోగ్యాంగా ఉంటే నే కుటుంబం ఆరోగ్యాంగా ఉంటుందని తద్వారా ఆరోగ్య సమాజం నిర్మించ బడుతుంద ని అన్నారు.కళా భారతిలో హెల్త్ డిపార్ట్మెంట్ వాళ్ళు ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో మహిళలు హెల్త్ చెక్ అప్స్ చేసుకోవాలని అన్నారు.ఏ స్కీం అయిన అది క్షేత్ర స్థాయి వరకు ప్రజల దాక చేరాలని అన్నారు.కార్యక్రమం చివర్లో ఆర్ పి లకు జంబో చెక్ చీరల డిస్ట్రిబ్యూషన్ చేయ డం జరిగింది.అంగన్వాడీ టీచర్స్ కి వంటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది.జంక్ ఫుడ్ తినకూడదని,నూనె,చక్కర వాడకం తగ్గించాలని పోషక హారం ప్రాధాన్యతను వివరిం చి ప్రతిజ్ఞ చేయించారు.కళా భారతిలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ని మున్సిపల్ కమిష నర్,మేయర్,ప్రజా ప్రతినిధు లు చూడడం జరిగింది. 181,1098 టోల్ ఫ్రీ నెంబర్ ప్రదర్శించారు.ఈ కార్యక్రమం లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు,మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి,పలుగురు కార్పొరేటర్స్,డిబ్ల్యూ ఓ సరస్వతి,సీడీపీఓ సబిత, డిప్యూటీ కమీషనర్ వేణు మాధవ్ డిఎంసీ శ్రీవాణి టీఎంసీ మానస,ఐసిడిఎస్ సూపెర్వైజర్స్ అంగన్వాడీ టీచర్స్,మహిళలు పాల్గొ న్నారు.ఖ

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**సీఎం ను కలిసిన ఎమ్మెల్యే కూనంనేని, రాష్ట్ర బృందం**

**కొత్తగూడెం మే 25 (తెలంగాణ వాణి)**
కొత్తగూడెం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని సిపిఐ రాష్ట్ర ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలు, అభివృద్ధి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ పాత ఎ, బి, సి స్టేషన్ల స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల రెండు విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించాలని, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ భవనాలను మంజూరు కోరామన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీని “కొత్తగూడెం--పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్”గా మార్చాలని కోరామని, కిన్నెరసాని ప్రాజెక్ట్ పర్యాటక అభివృద్ధికి, హరిత రిసార్ట్, బడ్జెట్



హోటల్ ముగింపు పనులకు అదనపు నిధులు ఇవ్వాలన్నారు. ముర్రేడు వాగు రీన్‌ఫోర్స్డ్ సాయిల్ వాల్ నిర్మాణానికి ?50.50 కోట్లు, సింగభూపాలెం, చింతల చెరువు ఆధునీకరణకు నిధులు క్లియర్ చేయాలని, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంపిణీ కాలువల డిజైన్ మార్చాలని కోరారు. విద్యా, క్రీడారంగాల కోసం 20 ఎకరాల్లో సమగ్ర క్రీడా స్టేడియం, మహిళల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ పనులకు ?1160 లక్షలు, గిరిజన మహిళా డిగ్రీ కాలేజీ భవనానికి ?30 కోట్లు మంజూరు చేయాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల పునర్నిర్మాణానికి ?25 కోట్లు, సుజాతనగర్ జూనియర్ కాలేజీ, కొత్త ఐటీఐలలో సిబ్బందిని కేటాయించాలన్నారు. వైద్య సేవల్లో భాగంగా పాల్వంచ సీహెచ్‌సీని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, జీజీహెచ్ కొత్తగూడెంలో కాత్ ల్యాబ్, ఎంఆర్ఐ స్కాన్ సౌకర్యాలు కల్పించి, పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. జీవో నెం.76 కింద ఇళ్ల క్రమబద్ధీకరణ, పెండింగ్ పోడు భూముల పట్టాల సమస్యను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను విడుదల చేయాలని కోరారు. కొత్తగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని, పాస్‌పోర్ట్ ఆఫీస్, మైలారం రాగి గని పునఃప్రారంభం, పాండురంగాపురం-భద్రాచలం రైల్వే లైన్ సాధన, డీఎంఎఫ్ టీ నిధుల విడుదల అత్యంత అవసరమన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రోడ్లు, వంతెనల నిర్మాణానికి, ఎంఆర్ఓ, జెడ్పీ, ఎంపీడీఓ శాశ్వత కార్యాలయ భవనాలకు నిధులు ఇవ్వాలని కోరారు. చివరగా నియోజకవర్గంలోని కొత్తగూడెం, పాల్వంచ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాము అందించిన వినతిపత్రంలో అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు.

# ఒకేసారి 8 వేల మహిళా సంఘాల భవనాలకు శంకుస్థాపన

**దేశంలోనే సంచలన నిర్ణయం :సీఎం రేవంత్ రెడ్డి**

**కరీంనగర్:మే 25(తెలంగాణ వాణి ప్రతినిది)**
హైదరాబాద్ సచివాలయం నుంచి వర్చు వల్ విధానంలో 8 వేల స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ నుంచి ముఖ్యమంత్రి వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమం.. ప్రసంగాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి,ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, డీఆర్డీవో గీత,జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి,మెప్మా పీడీ స్వరూప రాణి,మహిళా సంఘాల ప్రతినిధులు వీక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,మంత్రులు సీతక్క,శ్రీధర్ బాబు,పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి,తదిత రులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మహిళా సాధికారత,ఆర్థిక స్వావలం బన లక్ష్యంగా రాష్ట్ర ప్రభు త్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రజాపాలన,ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళా వారో త్సవాలను నిర్వహిస్తున్నా మని,మహిళలను ఆర్థికంగా నిలబెట్టే అద్భుతమైన కార్యక్రమం ఇది అని సీఎం పేర్కొన్నారు.ఒకేసారి 8 వేల మహిళా సంఘాల భవనాల కు శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలన నిర్ణ యమని తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వా దంతో ప్రజా ప్రభుత్వం ఏర్ప డిందని,మహిళల అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం అవు తుందన్నారు.ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులకే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇప్పటి వరకు ఈ పథకం కోసం రూ.10 వేల కోట్లను ఆర్టీసీకి





చెల్లించామని సీఎం తెలిపారు.మహిళల ఉచిత ప్రయాణాన్ని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించినా, మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధి అనే భావనతో ప్రభుత్వం ముందుకు సాగింద ని చెప్పారు.మహిళలను బస్సుల యజమానులుగా చేయాలనే ఉద్దేశంతో వెయ్యి బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే విధానం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించనున్నట్లు వెల్లడిం చారు.మహిళా సంఘాలను ఆర్థిక రంగంలో మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు.1000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాలతో ఏర్పా టు చేస్తున్నామని,పెట్రోల్ బంకుల నిర్వహణలో కూడా మహిళా సంఘాలను భాగ స్వామ్యం చేయనున్నామని చెప్పారు.గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదగాల న్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
బ్యాంక్ లింకేజ్ రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నామని, ఇప్పటి వరకు రూ.60 వేల కోట్ల రుణాలు అందించామని తెలిపారు.సున్నా వడ్డీ రుణా ల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించింద ని వెల్లడించారు.మహిళలు తీసుకున్న ప్రతి రూపాయిని నిజాయితీగా తిరిగి చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.మహిళా సంఘాలు రైస్ మిల్లులు, గోదాములు,లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకో వాలని సీఎం సూచించారు. అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు కేటాయిం చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.భవిష్య త్తులో మహిళా సంఘాలే వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.మహిళా శక్తి సూపర్ బజార్లను కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేయా లని,వాటిలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంటుం దని సీఎం తెలిపారు. డీమార్ట్,బిగ్ బజార్ కంటే మెరుగ్గా మహిళా శక్తి సూపర్ బజార్లు ఉండాలని ఆకాంక్షిం చారు.2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వ రులుగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# పెట్రోల్,డీజిల్ ధరల పెంపుపై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం

- **ఇందిరా చౌక్‌లో వినూత్న నిరసన**
- **ఆటోకు తాడు కట్టి లాగిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.**
- **మోడీ సర్కార్‌పై నిప్పులు.**
- **నెల రోజుల్లో 4 సార్లు పెట్రోల్ రేట్లు పెంచిన కేంద్రం**
- **రేట్లు తగ్గించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు**
- **ఎమ్మెల్యే సత్యం హెచ్చరిక**
- **నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన యూత్ కాంగ్రెస్ శ్రేణులు**

**కరీంనగర్:మే 25 (తెలంగాణ వాణి ప్రతినిది)**
ఎన్ డిఏ ప్రభుత్వ పాలనలో రోజు రోజుకీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్య క్షులు ముత్యం శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ ఇందిరా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ నిరసన కార్యక్ర మానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం,కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్,సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు ఆటో రిక్షాకు తాడు కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన తెలియజేయడంతో పాటు నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా పోలీసులకు కాంగ్రెస్ శ్రేణుల కు మధ్య స్వల్ప తోపులాట





జరిగింది,బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్,డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుడి బతుకు భార మైందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడు తూ,కేంద్రంలోని ఎన్.డి.ఎ నేతృత్వంలోని నరేంద్ర మోడీ సర్కార్ నెల రోజుల్లోనే నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యులకు మానసిక క్షోభకు గురి చేస్తు న్నారు,బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతు న్నాయని,దీంతో పేద,మధ్యత రగతి ప్రజలు తీవ్ర ఇబ్బందు లు పడుతున్నారని,ఇది నిజంగా సిగ్గుపడవలసిన విషయమని,నేరాలు ధరల్లో పెద్దగా హెచ్చు తగ్గులు లేకు న్నప్పటికీ,గత యూపీఏ హయాంలో బ్యారెల్ ధర ఇంతకంటే ఎక్కువగా ఉన్నప్ప టికీ సామాన్యులకు ఆర్థిక భారం పడకుండా సరసం అయిన ధరకే పెట్రోల్ డీజిల్ ఇంధనం అందించి పేద సామాన్యులకు అందించిన చరిత్ర ఉందని అన్నారు.కానీ నేడు అసమర్థ బీజేపీ ప్రభు త్వ పాలనలో రూపాయి విలువ పతనానికి చేరి దానివల్ల పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నా రని ఇప్పటికైనా పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో,రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ఫహద్,అసెంబ్లీ అధ్యక్షులు పంజాల కృపా సాగర్, కార్పొరేషన్ అధ్యక్షులు ఉప్పరి విశాల్,కార్పొరేటర్లు వరాల నరసింగం,పడాల శ్రీజ అజయ్,గుమ్మడి రాజకు మార్,పర్వతం మల్లేశం, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,పులి ఆంజ నేయులు గౌడ్,రజిత రెడ్డి, కుంభాల రాజ్ కుమార్, అబ్దుల్ రెహమాన్, ఆశిష్ గౌడ్,ఆమేర్,పెంట శేఖర్, ఎట్టం వేణు,తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులకు తిరుమలేశుని దర్శన భాగ్యం గోవిందా గోవింద

ప్రతీ సంవత్సరం కనీసం ఐదు సార్లు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ ద్వారా తిరుపతి వెంకన్న దర్శనం చేసుకునే నేను,గత జనవరి 2026 నుంచి ఏ రకంగా కూడా టికెట్లను బుక్ చేసుకోలేకపో యాను, కేవలం నేనే కాదు,ఇది ఎందరో సాధారణ భక్తుల మనోభావం.తితిదే వెబ్ సైట్/ఆప్ అలా పనిచేస్తోంది. జనవరి నుంచి నేటి (మే నెల)వరకు ఎస్ఈ డి టోకెన్ల నిర్దిష్ట బుకింగ్ రోజుల్లో నిమిషాల్లోనే లక్షల టికెట్లు బుక్ అయినట్లు చూపిస్తూ, కనీసం ఇద్దరికి కూడా బుక్ చేసుకునే అవకాశాన్ని లేకుండా చేస్తోంది.ఈ టికెట్ల జారీ లో మాత్రం ఏదో ఒక గోల్ మాల్ తప్పకుండా జరుగుతోంది.
లి) వేలల్లో స్లాట్లు కనిపిస్తున్నా “ ాశీతీతీవ్ ష్ట్రఱం ాశ్రీశీ ఱం్ఖనివఱ ఎఎ ంశీఎవశీఱవ,ా తీఎ ంశీఎవ శీష్ట్రవతీ ాశ్రీశీ.” అని రావటం.
లి) వివరాలు అన్ని ఎంటర్ చేసాక పేమెంట్ గేట్ వే లోకి రీడైరెక్ట్ అవుతుందని అక్కడే ఆగిపోవడం.తిరిగి లాగిన్ చేసే సరికి స్లాట్స్ అన్ని బుక్ అయిపోవడం.
లి) పేమెంట్ పూర్తయి, డబ్బులు కట్ అయిన తర్వాత కూడా స్లాట్ బుక్ అవకుండా డబ్బులు తిరిగి రావటం.




ఇలా ఒక్కో భక్తునికి ఒక్కో చేదు అనుభవం.
ప్రస్తుత ఆన్లైన్ విధానం ఏడుకొండలవాడిని భక్తుని నుంచి దూరం చేస్తోందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు.ప్రభుత్వ మరియు దేవస్థాన బోర్డు ఇంటి దొంగల మద్దతుతో దళార్లే అక్రమ మార్గాల్లో ఆ స్లాట్లను రిజర్వ్ చేసి, తరువాత నమ్మిన భక్తులకు అవసరానుసారం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇది కేవలం ఎస్ఈడి టోకెన్ల విషయంలోనే కాదు,రూం అకామడేషన్,ప్రత్యేక పూజలు,కల్యాణం, సుప్రభాతం వంటి వాటిల్లో సైతం తమ చేతి వాటాన్ని చూపిస్తున్నారు.మేము మాత్రమే హైందవ మతోద్ధారకులు,రక్షకులమని తమను తాము చెప్పుకునే ప్రస్తుత తె.దే.పా/జనసేన ప్రభుత్వం పారదర్శక వెంకన్న టికెట్ల విషయంలో అట్టర్ ఫ్లాప్ అయింది.పర మతస్థుడని/తిరుపతిని భ్రష్టు పట్టిస్తున్నడని ముద్ర వేసిన జగన్ హయాంలోనే తిరుమల టికెట్ల విషయంలో ఎంతో పారదర్శత ఉండేదని ఇప్పటికీ ఏ సామాన్య భక్తుడిని అడిగినా చెప్పగలడు.ఆ ఆపదమొక్కుల వాని దర్శనం ఇక పై కేవలం రాజకీయ నాయకులు,వారి సిఫారసు లేఖలు తెచ్చుకున్నోల్లకి మాత్రమేనని తేలిపోయింది.గోవిందా గోవిందా........

-రాజు జక్కుల
స్వతంత్ర పాత్రికేయుడు

## కారుణ్య నియామకాల ద్వారా ఐదుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు

- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది
- అర్హులకు పారదర్శకంగా కారుణ్య నియామకాలు
- ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు



**ములుగు,మే25(తెలంగాణ వాణి):**
ఉద్యోగంలో ఉన్న సమయంలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కారుణ్య నియామకాల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలిసి కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన ఐదుగురికి ములుగు జిల్లా పరిధిలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాలలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ నియామకాలతో సంబంధిత కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం లభించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు.ఏ. వెంకటలక్ష్మిని వెంకటాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో,పి.భానును ములుగు మండల పరిషత్ కార్యాలయంలో,డి.హరీష్‌ను ఏటూరునాగారం మండల పరిషత్ కార్యాలయంలో,పి.వంశీకృష్ణను వాజేడు మండల పరిషత్ కార్యాలయంలో పి.సునీతను తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

## ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా దేవర్ల కార్తీక్

**వనపర్తి : మే 25, (తెలంగాణ వాణి ప్రతినిధి ):**



తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కరీంనగర్లో ఈనెల 22,23, 24 నా నిర్వహించిన ఏబీవీపీ ప్రాంత అభ్యాస వర్గాలో ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ గా దేవర్ల కార్తీక్ ను రాష్ట్ర అధ్యక్షులు రావుల కృష్ణ గారు ఎన్నుకోవడం జరిగింది. అనంతరం కార్తీక్ మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి వనపర్తి జిల్లా కన్వీనర్ గా బాధ్యతలు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగ సమస్యలపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి విద్యారంగ సమాస్యలు ఉన్న ఏబీవీపీ దృష్టికి తీసుకు రాగలరని అన్నారు. జిల్లా కన్వీనర్ బాధ్యతపై తోటి స్నేహితులు, ఏబీవీపీ నాయకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచిన తెల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్ సమ్మర్ క్యాంప్





**తెల్లాపూర్ మే 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్, గణితం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసం వంటి విభిన్న అంశాలలో శిక్షణ అందించారు. క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కొత్త విషయాలు నేర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఉపాధ్యాయులు, వాలంటీర్లు మరియు తల్లిదండ్రుల సహకారంతో క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడిందని పేర్కొన్నారు. క్యాంప్ ముగింపు సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన గిరిజన విద్యార్థిని శ్రీనిధి

### చర్ల సీఐ, మిత్రబృందం ఆర్థిక సహాయం అందజేత

**చర్ల, మే 25 (తెలంగాణ వాణి)**



దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని అపక శ్రీనిధి ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భాన్ని చర్ల మండల సీఐ, అతని మిత్రుల బృందం జరుపుకుని ఆర్థిక సహాయం ప్రకటించారు. చర్ల మండల సీఐ గారి ఉదయం జరిగిన కార్యక్రమంలో శ్రీనిధికి రూ.30,000 నగదు అందజేశారు, ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, గ్రామ అధ్యక్షులు, సామాజిక ప్రముఖులు పాల్గొని శ్రీనిధి భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా పెరిగి పేద ప్రజలకు సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వారు గ్రామీణ నేపథ్యానికి చెందిన ఆమె కష్టపడి ఫలితాన్ని సాధించిందన్న విషయం ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమం లో నారాయణరావు పేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ గారు, కాంగ్రెస్ జిల్లా నాయకులు ముర్రం వీరభద్రం, సోడి చలపతి, ఆదివాసీ సీనియర్ నాయకులు పాయం సత్యనారాయణ, కల్లూరి కోర్రాజు, కొర్స మరయ్య తదితరులు పాల్గొని శ్రీనిధికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆస్తి కోసం కన్నతండ్రిని వేధించిన కుమారులపై కేసు

- వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,

**వనపర్తి : మే 25, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: సమాజంలో వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వేధించడం వంటి అమానుష ఘటనలను ఏమాత్రం సహించబోమని వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరించారు. కన్నతండ్రి ఆస్తులను తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకొని వృద్ధాప్యంలో అన్నం పెట్టకుండా, ఇంటికి రానీయకుండా వేధించిన ఇద్దరు కుమారులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని మెట్టుపల్లికి చెందిన వృద్ధుడు రంగం హనుమన్న జిల్లా ఎస్పీ సునీత రెడ్డిని కలిసి తన గోడును వినిపించారు. హనుమన్నకు ముగ్గురు కుమారులు ఉండగా, అందులో ఒకరైన బాలాజీ అనారోగ్యంతో మరణించారని, మిగిలిన ఇద్దరు కుమారులు చిన్న కృష్ణయ్య (హోంగార్డ్), రాములు (బంగారు వ్యాపారి) తన పేరు మీద ఉన్న భూమిని



మొత్తం తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకొని ప్రస్తుతం తనను ఇంటికి రానీయకుండా, అన్నం పెట్టకుండా, శారీరకంగా వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వృద్ధుడి బాధను విన్న జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి హనుమన్నను ఓదార్చి, అతనికి పూర్తి న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేయించి చట్టపరమైన చర్యలకు ఆదేశించారు. అంతేకాకుండా వృద్ధుడి పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించిన ఎస్పీ ఆయనను వృద్ధాశ్రమంలో చేర్పించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు జీవితాంతం పిల్లల కోసం కష్టపడతారు. అలాంటి వృద్ధులను ఆస్తుల కోసం వేధించడం, నిర్లక్ష్యం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. వృద్ధులపై ఎలాంటి వేధింపులు జరిగినా పోలీసుశాఖ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటుంది. సమాజంలో పెద్దలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత కన్నతల్లిదండ్రులను వేధించడం, ఇంటి నుంచి వెళ్లగొట్టడం, ఆస్తుల కోసం హింసించడం వంటి అమానుష చర్యలను సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. జీవితాంతం పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో అవమానించడం మానవత్వానికే మచ్చ. ఆస్తులను తమ పేర్లపై రాయించుకొని తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. వృద్ధులపై శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా వేధింపులకు పాల్పడే వారెవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించము. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలి. వృద్ధుల భద్రత, సంక్షేమం కోసం పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరించారు.

# పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం రక్షణ కవచం

- పోష్ చట్టంపై అందరికీ తప్పనిసరిగా అవగాహన కల్పించాలి
- మహిళలను వేధిస్తే కఠిన చర్యలు
- మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యం
- జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు

**ములుగు,మే25(తెలంగాణ వాణి):**
పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం ఒక రక్షణ కవచంలా ఉంటుందని,పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం--2013పై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, మహిళలను వేధిస్తే చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించబడతాయని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు తెలిపారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో భాగంగా "మహిళల భద్రత -- రక్షణ" కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు



చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో మహిళలు గౌరవంగా, భయభ్రాంతులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని అన్నారు. పోష్ చట్టం మహిళా ఉద్యోగులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని పేర్కొన్నారు.ప్రతి కార్యాలయంలో 10 మందికి పైగా ఉద్యోగులు ఉంటే అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.వేధింపులకు గురైన మహిళలు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని,ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై నిర్దేశిత గడువులోపు చర్యలు తీసుకునేలా చూస్తామని అన్నారు. పోష్ చట్టంపై ప్రతి



ఉద్యోగికి అవగాహన కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు.మహిళా ఉద్యోగుల భద్రతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. షీ-టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మాట్లాడుతూ, జిల్లాలో మే 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఘనంగా మహిళావారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోష్ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. "బాల్య వివాహం -- బతుకు ఆగం" అనే నినాదంతో బాల్యవివాహాల రహిత ములుగు జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# అక్రమ భూమి కబ్జాలను తక్షణమే నిలిపివేయాలి

- ఆశ్రమ బాలికల పాఠశాల వెనుక ఉన్న ప్రభుత్వ భూమినే అక్రమాలకు అడ్డా
- రెవెన్యూ,గిరిజన సంక్షేమ శాఖలతో సంయుక్త సర్వే నిర్వహించాలి
- ఆక్రమించిన భూములను వెంటనే ఖాళీ చేయించాలి
- తుడుందెబ్బ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు తాటి నీలాద్రి

**ములుగు,మే25(తెలంగాణ వాణి)**
:ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఆకులవారి ఘణపురం గ్రామంలోని ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల వెనుక ఉన్న విలువైన ప్రభుత్వ భూమిపై కొంతమంది గిరిజనేతరులు అక్రమ కబ్జాలకు పాల్పడేందుకు ప్రయత్నించడం అత్యంత దారుణమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి



తుడుందెబ్బ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు తాటి నీలాద్రి అన్నారు. గిరిజన బాలికల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలు గిరిజనుల హక్కులపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. ఇప్పటికే పాఠశాల తీవ్ర స్థలాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటోందని, విద్యార్థినులు ఆడుకునేందుకు సరైన మైదానం కూడా లేదని, భవిష్యత్తులో అదనపు తరగతి గదులు,హాస్టల్ భవనాలు,ల్యాబ్‌లు నిర్మించేందుకు కూడా స్థలం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు తాటి నీలాద్రి మాట్లాడుతూ షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనుల హక్కులను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరం. గిరిజన బాలికల విద్య కోసం ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూమిని గిరిజనేతరులు కబ్జా చేయడానికి ప్రయత్నించడం వెనుక పెద్ద కుట్ర ఉంది. అధికారులు వెంటనే స్పందించి అక్రమ కబ్జాలను అడ్డుకోకపోతే గిరిజన సంఘాలను ఏకం చేసి భారీ ఉద్యమాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తాం. పరిస్థితులకు పూర్తి బాధ్యత అధికారులదే అవుతుంది అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. అలాగే వెంటనే రెవెన్యూ మరియు గిరిజన సంక్షేమ శాఖలతో సంయుక్త సర్వే నిర్వహించి, పాఠశాల వెనుక ఉన్న ప్రభుత్వ భూమిపై జరుగుతున్న అక్రమ కబ్జాలను తక్షణమే నిలిపివేయాలని,ఇప్పటికే ఆక్రమించిన భూములను వెంటనే ఖాళీ చేయించాలని, మొత్తం భూమిని అధికారికంగా ఆకులవారి ఘణపురం ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలకు కేటాయించాలని, హద్దులు నిర్ణయించి రక్షణ బోర్డులు ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో గిరిజనేతరుల అక్రమ ప్రవేశాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన బాలికల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే తుడుందెబ్బ చూస్తూ ఊరుకోదని,అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# జూన్ 3న పాకాల కొత్తగూడలో పోరు-కేక

- ఆదివాసీల భారీ హాజరుకు పిలుపు
- తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు: వాసం ముసలయ్య

**చర్ల, మే 25, (తెలంగాణ వాణి)**
తుడుందెబ్బ పార్టీ రాష్ట్ర నాయకులు, మండలి నేతలు జూన్ 3న పాకాల కొత్తగూడలో నిర్వహించబోయే పోరు-కేక కార్యక్రమానికి ఆదివాసీ ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ హక్కులు నిలబెట్టుకోవాలని వేడుకుంటున్నారు. ఇవాళ చర్ల మండల కేంద్రంలోని గొండ్వాన సంక్షేమ పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఈ పిలుపునిచ్చారు. గొండ్వాన సంక్షేమ పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వాసం ముసలయ్య మాట్లాడుతూ, 1976లో లంబాడి, సుగాలి, బంజారా విశేషాల పేర్లపై అనవరతంగా జాతీయ రిజర్వేషన్ కేథకంలో మన ఆదివాసీల హక్కులను తేడా చేసినట్టు ఆరోపించారు. "ఆ సమయంలో కూడా నిన్ను ఇతర విభాగంగా పరిగణించగా, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం రిజర్వేషన్ స్థానాలను లంబాడా వర్గాలకే కేటాయించడం ద్వారా మన ఆదివాసీ గుర్తింపును మరియు హక్కులను శోధిస్తున్నారు"ని ఆయన తెలిపారు.వాసం ముసలయ్య మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా ఆదివాసీ సమాజం వివిధ పోరాటాల ద్వారా పొందిన రిజర్వేషన్ హక్కులను?రాజకీయ మరియు పరస్పర ప్రయోజనాల కోసం పట్టుబట్టడం ప్రజాజీవితం మరియు సంస్కృతి స్థితి పై తీవ్ర ప్రభావం చూపుతున్నదని హెచ్చరించారు. గతంలో భద్రాచలం వేదికగా ధర్మయుద్ధంతో తమ హక్కులను సమరశంకం పూరించినప్పటికీ ప్రభుత్వం ఆదివాసీ సమస్యలపై సంతృప్తికర చర్యలు తీసుకుంటోన్నట్టుగా లేదని చెప్పారు.సభలో నేతలు స్పష్టం చేసినట్టుగా, జూన్ 3న జరిగే పోరు-కేక కార్యక్రమం ద్వారా ఆదివాసీ ఐక్యతను ప్రదర్శిస్తూ లంబాడా వర్గాల అధికరణకు సమర్థంగా ప్రతిఘటన చూపిస్తామని తెలిపారు. "లంబాడాలను తరిమిపార్చే వరకు మా ఉద్యమం ఆగదు" అని నేతలు స్పష్టం చేయగా, ప్రభుత్వాలు తీర్మానం తీసుకునేంతవరకూ యథార్థమైన పరిష్కారానికి వేగంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటి రామకృష్ణ, తాటి శ్రీను మరియు ఇతర స్థానిక నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## జ్ఞానంతో విద్యార్థులను ఉంచడమే మా లక్ష్యం

### సాయి ఎక్సలెంట్ పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభం

### పాఠశాల ఇంచార్జ్ స్వర్ణలత

**జూలూరుపాడు: మే 25, ( తెలంగాణ వాణి ప్రతినిధి ):**



మండలంలోని సాయి ఎక్సెలెంట్ పాఠశాల నందు ప్రపంచ స్థాయిలో విద్యార్థిని విద్యార్థులను తీర్చి దిద్దే విధంగా డిజిటల్ తరగతులు ప్రారంభించడం జరిగిందని పాఠశాల ఇంచార్జ్ స్వర్ణలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని పాఠశాల యాజమాన్యం డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు. పల్లె, పల్లెకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సదుద్దేశంతో 2026 -2027 విద్యా సంవత్సరానికి ముందుకు అడుగులు వేసేదానిలో భాగంగా డిజిటల్ క్లాసులను కార్పొరేట్ లీడ్ అనే సంస్థ తో ఒప్పందం చేసుకొని నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. బట్టికి స్వస్తీ పలుకుతూ తనంతటా తాను పాఠాన్ని అవగాహన చేసుకుంటూ పాఠాన్ని పూర్తిగా అవగాహన కలిగి ఉంటారని పేర్కొన్నారు. అదే విధంగా విద్యార్థులు విని నేర్చుకోవడం కంటే చూసి నేర్చుకోవడం ద్వారా ఎక్కువ గుర్తుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, నభీన, దుర్గ భవాని, సత్యవతి, రమేష్, ఉదయభాను, కళ్యాణి, ప్రశాంతి, అరుణ, సౌజన్య, హైమావతి, శాంతమ్మ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ భ్రమరాంబ మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం



**తెల్లాపూర్ మే 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రామచంద్రాపురం మండలంలోని ఉస్మాన్ నగర్ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లన్న స్వామి, శ్రీ శ్రీ శ్రీ కామరాతి -- బీరప్ప స్వామి వారి కళ్యాణ మరియు జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా మే 24న ఆదివారం మల్లన్న స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, గండదీపం కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం స్వామి వారి కళ్యాణోత్సవంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఆదర్శ్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సుఖశాంతులు, గ్రామాభివృద్ధి కోసం దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లేపల్లి సోమిరెడ్డి, తెల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, తెల్లాపూర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ ఉమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, మల్లేష్, సాగర్ బాబ్జీ, అలాగే ఆలయ కమిటీ సభ్యులు శ్రావణ్, సాయి, కొమ్మరయ్య, శ్రీశైలం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, సాయంత్రం అగ్గి గుండాలు, గొలుసు తెంపుట, ఒగ్గు కథ వంటి భక్తి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ మహోత్సవాలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## వరి కోయ్యలు కాల్చొద్దు

### ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్



**ధర్మారం :మే 25 (తెలంగాణ వాణి)**
పంట కోతల తర్వాత వరి కొయ్యలను కాల్చొద్దని అలా చేయడం వల్ల చుట్టుపక్కల భారీ అగ్ని ప్రమాదాలు సంభవించి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించే అవకాశం ఉందని ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ వరి కోయ్యలు తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలు మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పొలాల్లో అంటుకునే మంటలు పక్కనే ఉన్న ఇల్లు, నిల్వ ఉంచిన ధాన్యం కుప్పలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు వ్యాపించి తీవ్ర నష్టం కలిగిస్తాయన్నారు. కొయ్యలు కాల్చడం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించి. భూసారం దెబ్బతింటుందని దీనివల్ల భవిష్యత్తులో పంటను దిగుబడి తగ్గిపోతుందని సూచించారు. పొగ కారణంగా గాలి కలుషితమై ప్రజలకు శ్వాసకోశ సమస్యలు వస్తాయని అన్నారు. వరి కోయ్యలను కాల్చే బదులు వాటిని భూమిలోనే కలియ దున్నడం ద్వారా భూమికి సహజమైన పోషకాలు అందుతాయని దానివల్ల ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుందని ఈ విషయమై వ్యవసాయ అధికారులు పోలీసు సూచనలు రైతులు పాటించాలని కోరారు.

## మల్లెగూడంలో మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన



**రాజపేట మే: 25(తెలంగాణ వాణి విలేఖరి )**
రాజాపేట మండల కేంద్రంలోని మల్ల గూడెం గ్రామంలో మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన చేశారు. మండలంలో మల్లెగూడంతో పాటు మొత్తం 19 గ్రామాలకు మహిళా సంఘ భవనాలు మంజూరు కాగా ఈరోజు కొన్ని గ్రామాలకు ప్రారంభించారు. ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకృషి ఫలితంగానే మండలానికి ఇన్ని భవనాలు మంజూరయ్యాయి. పార్టీలకు అతీతంగా, కేవలం గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యేకు మండల ప్రజలు, ముఖ్యంగా మహిళా లోకం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు రావడం వల్ల గ్రామీణ మహిళలకు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల,మే 25 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**



ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన వాటిని పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలలో కొనసాగుతున్న ప్రజవాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలలోను ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాజేందర్ రెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 9 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కే.ఎస్.బీ కుమారి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 12 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 41 ఫిర్యాదులు స్వీకరణ
- ఎస్పీ మహేష్ బి.గితే.

**రాజన్న సిరిసిల్ల,మే 25 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 41 ఫిర్యాదులు స్వీకరించి,ఎస్పీ మహేష్ బి.గితే పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను



చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎంపీడీవో మంజుల

### -ఏపీవో రాజ్ కుమార్,

**జహీరాబాద్/ఝరాసంగం: మే 25(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలం కొల్లూరు గ్రామంలో చింతలగట్టు సుజాత భర్త చింతలగట్టు ప్రభు గార్ల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కార్యక్రమంలో ఎంపీడీవో మంజుల ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు గ్రామ సర్పంచ్ చింతలగట్టు శివరాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నూతన గృహంలో ఆ కుటుంబం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్,న్యాయవాది నందు పాటిల్, శ్రీకాంత్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు డప్పూరు సంగమేష్, హౌసింగ్ ఏఈ శివానంద్, కార్యదర్శి రవి,వనమ్‌పల్లి సర్పంచ్ నవీన్ పాటిల్, పోలీస్ నర్సింలు, ఉపాధ్యాయులు సంగమేష్,వార్డు సభ్యులు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు వై



నగేష్, సి హెచ్ మాణయ్య,చింతలగట్టు ప్రకాష్,శారదమ్మ,షెరీ సంగమేష్,ఫీల్డ్ అసిస్టెంట్ సి సుబాకర్, రిపోర్టర్ సి నర్సింలు ,గ్రామ పెద్దలు సి మొగులయ్య, సి నర్సప్ప,ఎం మొగులయ్య, డప్పూరు రాములు, మెహబూబ్, సి రాజ్‌కుమార్,ఎం విష్ణు,సి దినకర్ మరియు గ్రామ పెద్దలు,నాయకులు, బంధు మిత్రులు,గ్రామ ప్రజలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తధితరులు పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి లబ్ధిధారులకు శుభకాంక్షలు తెలియజేసారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసువాలి

**రాజపేట మే:25(తెలంగాణ వాణి విలేకరి)**
రాజపేట మండల కేంద్రంలో చల్లూరు గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు చల్లూరు గ్రామం లో టీబీ వైద్య శిబిరం ను ఏర్పాటు చేశారు. శిబిరంను సర్పంచ్ భీమగాని రూప ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీబీ స్క్రీనింగ్ హెల్త్ క్యాంప్ లను అందరూసద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఇటువంటి కార్యక్రమం వలన అందరికీ వైద్యం అందుతుందని పేర్కొన్నారు. ఇందులో బిపి,, షుగర్,క్యాన్సర్,టీబీ వారికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా 136 మందికి టీబి స్క్రీనింగ్ చేశారు. అందులో 96 మందికి ఛాతి ఎక్సరే తీశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ మండలవైద్యధికారి డాక్టర్ మోసెస్ రాజ్, హెల్త్ ఎక్స్టెంషన్



ఆఫీసర్ భీకు నాయక్, సూపర్వైజర్ ప్రేమలత , మానస హెల్త్ అసిస్టెంట్ మాధవి జిల్లా టీబి సూపర్వైజర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నటేష్, ఎక్సరే టెక్నీషియన్ ఉమేష్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూముల మార్కెట్ విలువలపై సమీక్ష

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ మే 25( తెలంగాణ వాణి ప్రతినిధి )**
రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం భూముల మార్కెట్ విలువల నవీకరణను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను బాధ్యతాయుతంగా నిర్వహించాలని చెప్పారు. సోమవారం ఉదయాదిత్య భవనంలో సబ్ రిస్ట్రార్లు, తహసిల్దార్ లు, ఎంపీడీవో లతో భూముల మార్కెట్ విలువల పై సమీక్ష నిర్వహించారు. జీవో నెం.41 ప్రకారం భూముల మార్కెట్ విలువల (మార్కెట్ వాల్యూ) నవీకరణ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అర్బన్, రూరల్ కేటగిరీలుగా విభజించి ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి 1, 2, 3, 4 ఫారమ్‌ల ఆధారంగా ప్రాంతాల వారీగా రహదారులు, మండల కేంద్రాలు, నియోజకవర్గ పరిధులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని భూముల విలువలను అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ విలువలను పరిశీలించి ఆర్డీవో స్థాయిలో అప్లోడ్ చేస్తున్నామని, అనంతరం మార్కెట్ విలువలను ఫైనల్ చేసి కమిటీ ఆమోదానికి పంపనున్నట్లు తెలిపారు. అర్బన్ కమిటీలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా ఉండగా, మున్సిపల్ కమిషనర్, జెడ్పీసీఈఓ, సబ్-రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. రూరల్ కమిటీలో ఆర్డీవో చైర్మన్‌గా, సబ్-రిజిస్ట్రార్, తహసీల్దార్, ఎంపీడీవో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు. నాన్-అగ్రికల్చర్



ఫిజికల్ కమిటీలలో ఫారమ్-1, 2లను, అగ్రికల్చర్ కమిటీలలో ఫారమ్-3, 4లను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల చట్టం ప్రకారం అన్ని వివరాలను సరిచూసుకుని నమోదు చేయాలని సూచించారు. అగ్రికల్చర్ భూములకు కనీస మార్కెట్ విలువ రూ.2.75 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు ఉండాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, మిర్యాలగూడ ఆర్డిఓ రమణారెడ్డి, దేవరకొండ ఆర్డిఓ ప్రియదర్శిని, సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన భూముల రిజిస్ట్రేషన్మార్కెట్ విలువల సవరణ సమావేశం..

**జగిత్యాల: మే 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మార్కెట్ విలువల సవరణలపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం నేడు విజయవంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆధ్వర్యశీలో జరిగిన ఈ సమావేశానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరై మార్కెట్ విలువల పునర్విమర్శపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.41, రెవెన్యూ (రిజిస్ట్రేషన్-×) శాఖ, తేదీ 25-04-2025 ప్రకారం భూ మార్కెట్ విలువల సవరణకు సంబంధించిన మార్గదర్శకాలు, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల వర్గీకరణ, వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువల నిర్ణయం, ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న ఆస్తుల ప్రత్యేక విలువల నిర్ణయం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. అదనంగా, పట్టణ ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ ప్రాంతాలలో మార్కెట్ విలువల నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన కమిటీల బాధ్యతలు, విధానాలు, స్థానిక స్థాయిలో అనుసరించాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన కల్పించబడింది. జిల్లాలోని అన్ని సబ్-



రిజిస్ట్రార్ పరిధుల్లో భూముల ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను పరిశీలించి పారదర్శకంగా, ప్రజలకు అనుకూలంగా మార్కెట్ విలువల సవరణ ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించబడింది. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత, ఆర్డీవోలు మధుసూదన్, నరసింహ రావు, జీవాకర్ రెడ్డి, జిల్లాలోని అందరు తహసీల్దార్లు, ఎంపిడివోలు, మునిసిపల్ కమిషనర్లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదంపై ఎక్సైజ్ అధికారుల విచారణ

**ధర్మారం :మే 25 (తెలంగాణ వాణి )**
ఇటీవల ధర్మారం మండల కేంద్రంలోని సలాంద్రి లో తాటి వనంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం పై సోమవారం పెద్దపల్లి ఎక్సైజ్ అధికారులు సిఐ నాగేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్సై జీవన్ రెడ్డి సలాంద్రీ లో జరిగిన అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను గౌడ సంఘం నాయకులను అడిగి తెలుసుకుని జరిగిన నష్టాన్ని అంచనా వేసి పంచనామ చేశారు. పంచనామా చేసిన నివేదికను పై అధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశం గౌడ్, బొమ్మగాని సతీష్ కుమార్, గౌడ సంఘం నాయకులు గాజుల రాజు గౌడ్, నాడెం శ్రీనివాస్, తోడేటి మురళి గౌడ్, పెరుమాండ్ల ప్రసాద్ గౌడ్, ఎరుకలి ఎల్లయ్య గౌడ్, అంజయ్య గౌడ్, బొమ్మగాని రాజేశం గౌడ్, బొమ్మగాని తిరుపతి గౌడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కేటీఆర్ తనయుడు





**వేములవాడ,మే 25 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయం భీమేశ్వర స్వామి ఆలయంలోని స్వామివారికి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు వారి స్నేహితులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి కోడె మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదొక్త ఆశీర్వచనం చేయగా ఆలయ ఈఓ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో ముగిసిన సమ్మర్ క్యాంప్.



**ఇబ్రహీంపట్నం మే 25 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 15 రోజుల నుండి నడుస్తున్న సమ్మర్ క్యాంప్ నేటితో ముగిసింది. ఈసమ్మర్ క్యాంపుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు సాధారణ క్లాసులు కాకుండా వివిధ సబ్జెక్టులలోనీ ఈజీ మెథడ్స్ ను అదే విధంగా కంప్యూటర్ బేసిక్స్,చెస్,క్యారం వీటితోపాటు ఫిజికల్ ఎక్సర్సైజులుయోగ నేర్పించడం జరిగిందని తెలిపారు. ఇలాంటి సమ్మర్ క్యాంపులను విద్యార్థులు ఎక్కువమంది వినియోగించుకోగలరని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ గత సంవత్సరం కూడా నిర్వహించడం జరిగిందని విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలో వినియోగించుకున్నారని తెలిపారు. విద్యార్థులకు స్నాక్స్ కూడా అందించడం జరిగినదని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఆర్పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన ఖేడ్ పోలీసులు




**సంగారెడ్డి: నారాయణఖేడ్, మే 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో ప్రియుడు తోకలిసి భార్య కల్పన భర్త ముత్యం రెడ్డిని హత్య చేసిన సంఘటన తెలిసిందే, ఈ కేసులో నారాయణఖేడ్ పోలీసులు సాంకేతికత ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై శ్రీశైలం మీడియాకు వెల్లడించారు, మృతుడి భార్య కల్పన, ఆమె ప్రియుడు గైని పండరి, అతని అన్న విట్టల్ కలిసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు, నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య :హెచ్ఎం సంగీత



**అందోల్ /రాయికోడ్ :మే 25(తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాంపాడ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల వద్ద బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంగీత మాట్లాడుతూ, ప్రతి బాలబాలికలు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. గ్రామంలోని పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలకు పంపించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు.మరియు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్, మచ్చేందర్, రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సౌజన్య,రాజమల్లు, రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ మనోహర్ రావ్ ,మాజీ సర్పంచ్ కాశీనాథ్ రావు,ఫీల్డ్ అసిస్టెంట్ మొగులయ్య,గ్రామ ప్రముఖులు అఖిల్,విట్టల్, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలి

**-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాజేష్,జిల్లా కార్యదర్శి కిందిదొడ్డి సతీష్**




**సంగారెడ్డి/జహీరాబాద్: మే25(తెలంగాణ వాణి ప్రతినిధి)**
పర్మిషన్ లేకుండా అడ్మిషన్స్ తీసుకుంటున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం రోజు ప్రజావాణిలో సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ సంగీత మేడంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి. రాజేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిందిదొడ్డి సతీష్ లు మాట్లాడుతూ.....సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పెర్మిషన్ లేకుండా అడ్మిషన్స్ తీసుకుంటున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతి లేకుండా నారాయణ కళాశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ కాలేజ్ ఫీజు లక్ష రూపాయల నుండి లక్ష యాభై వేల రూపాయలు వసూలు చేస్తున్నారని మండి పడ్డారు. అవి కాక అదనంగా బుక్స్,డ్రెస్ కోడ్, మెస్ ఫీజు కలుపుకొని లక్ష రూపాయలు వసూలు చేస్తూ విద్యాను వ్యాపారంగా మారుస్తున్నారని పేర్కొన్నారు.కాబట్టి ఇప్పటికైన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తక్షణ మే పర్మిషన్ లేకుండా అడ్మిషన్స్ తీసుకుంటున్న నారాయణ కళాశాల సీజ్ చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తమ ఇష్టానుసారంగా అడ్మిషన్స్ తీసుకుంటున్న నారాయణ కళాశాల యాజమాన్యం పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్,జిల్లా కమిటీ సభ్యులు కెవిఎల్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

## తండ్రి కోసం రక్తదానం చేసిన ఆలేటి గణేష్.

**తండ్రికి తగ్గ తనయుడు గా ప్రశంసలు**



**పెద్దపల్లి :మే, 25,(తెలంగాణ వాణి విలేకరి)**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి కీ చెందిన ఆలేటి పెంటయ్య కుమారుడు ఆలేటి గణేష్ తన తండ్రి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని స్వయంగా రక్తదానం చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈ రోజుల్లో తల్లిదండ్రులకు అన్నం పెట్టడానికే వెనుకాడే కొడుకులు ఉన్న సమయంలో, తన తండ్రి ప్రాణాల కోసం రక్తం ఇచ్చే స్థాయిలో ముందుకు రావడం నిజంగా అభినందనీయం అని పలువురు కొనియాడుతున్నారు. తండ్రిపై ఉన్న ప్రేమ, బాధ్యతను చేతల్లో చూపించిన గణేష్‌ను చూసి ఆసుపత్రి సిబ్బంది, బంధువులు “తండ్రికి తగ్గ తనయుడు” అంటూ ప్రశంసించారు. కుటుంబ బంధాలు తగ్గిపోతున్న ఈ కాలంలో ఇలాంటి సంఘటనలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.“తండ్రి కోసం రక్తం ఇవ్వడం నా బాధ్యత” అని గణేష్ వినమ్రంగా చెప్పడం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురి చేసింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, గణేష్ స్నేహితులు పాల్గొన్నారు

# పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలి

- బీజేపీపై కేటీఆర్, హరీష్ రావు, జీవన్ రెడ్డిలు ఎందుకు మాట్లాడంలేదు..?
- ధాన్యం, మక్కజోన్నల కొనుగోలుపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు.. ?
- జగిత్యాల జిల్లా కేంద్రంలో పెట్రోల్ డీజిల్ ధర పెంపుపై నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి

**జగిత్యాల:మే 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనె తగ్గించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పేద ప్రజల సంక్షేమం ఏనాడు పట్టించుకోవడంలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి మోడి పెట్రోల్, డీజిల్ ధరల విషయం




మాట్లాడలేదని అన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు, కేరళ మరియు పచ్చిమబెంగాల్ ఎన్నికల పూర్తి అయిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మంత్రి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వం దేశ ప్రజలు ఎవ్వరు విలాసవంతాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిందని దీని అర్థం మన దేశ ఆర్థిక వ్యవస్థ అస్థవ్యస్తంగా మారిందని భావించవచ్చని మంత్రి అడ్లూరి అన్నారు. రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతున్న మోడి మాత్రం నిద్ర లేవడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగాఉన్న బీఆర్ఎస్ పార్టీ నరేంద్ర మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, జీవన్రెడ్డిలు ఎందుకు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడం లేదని మంత్రి ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు బండి భగీరథ్ అంశంపై ఎందుకు బీఆర్ఎస్ నాయకులు నోరు మెదపడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మీద ఉన్న దృష్టి ధాన్యం కొనుగోలు, మక్కల కొనుగోలుపై లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పంటల వడ్లు కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న ఎఫ్ సీ ఐ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం సేకరించడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మిగిలిన లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు తగ్గించాలని రాష్ట్రంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన మక్కలతో పాటు ఎఫ్ సీ ఐ ద్వార బియ్యం సేకరించాలని మంత్రి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య తదితరులు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు ఇంకా ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణితో పాటు జగిత్యాల జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దేశంలో ఎక్కడా లేని సమస్యలన్నీ తెలంగాణలోనే...

- నెలాఖరుకల్లా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి...
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి...

**రాయికల్: మే 25(తెలంగాణ వాణి):**
రాయికల్ పట్టణంలో సోమవారం రోజున రహదారిపై ధర్నా చేస్తున్న రైతులకు మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి,మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ వరి ధాన్యాకు బదులు మొక్కజొన్న పప్పు దినుసులు పండించాలని ప్రభుత్వం చెప్పింది.ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఖరీఫ్ లో వరి సాగు చేసిన రైతు రబి లో మొక్కజొన్న వేశాడు.మొక్కజొన్న ప్రతి ఎకరానికి 40 క్వింటాళ్లు వస్తాయి ప్రభుత్వం 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్తున్నారు.అయితే 25 క్వింటాలు కొంటే మిగతా 15 క్వింటాలు ఎటు పోవాలి. 25 క్వింటాలకు మద్దతు ధర 2400 ఉంటే బయట 1600 నుండి 1800 ఇస్తున్నారు.అంటే 15 క్వింటాలకు క్వింటాల్కు 600 చొప్పున రైతులు నష్టపోతున్నారు అంటే దాదాపుగా 9000 వరకు నష్టపోతున్నారు.రైతు భరోసా ఎలాగో ఇవ్వడం లేదు.కెసిఆర్ ఎకరానికి 10,000 రూపాయలు ఇచ్చారు.రేవంత్



రెడ్డి చెప్తే నమ్ముతారో నమ్మరో అని రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ లో వరి పంటతో పాటు ప్రతి పంటకు బోనసు ఇస్తామని చెప్పినారు బోనస్ కూడా లేకుండా పోయింది అని అన్నారు. రాయికల్ మార్కెట్లో తూకం వేసిన మొక్కజొన్న 20 రోజులు అవుతుంది.రోహిణి కార్తె ఆరంభం నాటికి వరి మొక్కజొన్న కొనుగోలు పూర్తయ్యేటివి,ఇప్పటివరకు కొనుగోలు చేయకపోవడం ఇదే మొదటిసారి అని,ప్రజా పాలన అంటే ప్రజలకు అందుబాటులో లేకపోవడమా అని ప్రశ్నించారు.విధి లేని పరిస్థితుల్లో రైతులు రోడ్ ఎక్కాల్సి వస్తుంది.రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చినట్టుంది ఈరోజు ఐదు లారీలు తీసుకువచ్చి తూకం వేస్తామని అన్నారు.ఈనెల 31 లోపు కొనుగోలు పూర్తి అవ్వాలి అని డిమాండ్ చేశారు.దేశంలో ఎక్కడ లేని విధంగా సమస్యలన్నీ తెలంగాణలోనే ఉన్నట్టు అనిపిస్తుంది,కాంగ్రెస్ నాయకులు నిరసన ధర్నాలు చేస్తున్నారు అది ఎందుకు చేస్తున్నారో కూడా అర్థం కావడం లేదు.రైతులు సమస్యల్లో ఉంటే కొనుగోలు కేంద్రాల చుట్టూ ఎమ్మెల్యేలు గానీ మంత్రులు గాని వెళ్లకుండా పెట్రోల్ ధర పెరిగింది డీజిల్ ధర పెరిగింది అని అంటున్నారు అవును పెరిగింది బిజెపికి ఎంత బాధ్యత ఉందో కాంగ్రెస్ కూడా అంతే బాధ్యత ఉంటుంది అని గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి సిగ్గుపడాలి ,పెట్రోల్ మీద 35%వ్యాట్,డీజిల్ మీద 28 శాతం వ్యాట్ ఉంది.ఇది ఎక్కడ లేదు నార్త్ ఇండియాలో 18 నుండి 19 శాతం ఉంది. దొంగే దొంగ అన్నట్టుగా ఉంది కథ,పెట్రోల్ డీజిల్ ధరలకు కాంగ్రెస్ ధర్నా చేస్తది వద్దు కొంటలేరని బిజెపి వాళ్లు ధర్నా చేస్తారు.రైతుల రోడ్డు ఎక్కకుండా ఉండాలంటే రెవెన్యూ అధికారుల బాధ్యత ఉన్నది అని అన్నారు.ధాన్యం సరఫరా ధాన్యం కొనుగోలు ప్రారంభం కాకుంటే రోడ్డు పైన వంట వార్పు కార్యక్రమం చేస్తాం, అధికారులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి లేదంటే రైతుల పక్షాన మా పోరాటం కొనసాగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో రైతుల తో పాటు వివిధ హోదాలో ఉన్న బి ఆర్ ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం కోసం వెయ్యి గజాల స్థలం, భవన నిర్మాణం

- అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- ప్రతి కార్మికుడికి గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, మే 25, (తెలంగాణ వాణి రిపోర్టర్):**
శర వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగానికి కీలకంగా మారిన సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో నియోజకవర్గ స్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన



సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులు చేయాలని కోరారు. సంఘం సభ్యుల కోరిక మేరకు, అతి త్వరలో వెయ్యి గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి ఆరోగ్య భద్రతను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి సెంట్రింగ్ కార్మికుడికి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు.. లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, రాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు యాదగిరి, అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

- జిన్నారం పురపాలిక అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధుల కేటాయింపు
- మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత
- పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**జిన్నారం మున్సిపల్ పరిధిలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు, మే 25,(తెలంగాణ వాణి రిపోర్టర్):**
జిన్నారం మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్, రాళ్లకత్వ, రాళ్లకత్వ తండా, సోలక్ పల్లి అండూర్, ఇమామ్ నగర్, ఊట్ల, దాదిగూడెం, మంగంపేట, జిన్నారం, జంగంపేట, కొడకంచి, నల్తూరు, కొర్లకుంట వార్డుల్లో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక పాలక వర్గంతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 75 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ప్రజల



నమ్మకంతో ఐదు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీకి అధికారం అందించారని, వారి నమ్మకానికి అనుగుణంగా వచ్చే ఐదు సంవత్సరాల పాటు మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పాలకవర్గం సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నేటి విద్యార్థులే రేపటి భావి భారత నిర్మాతలు

**నారాయణ ఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి**

**నారాయణఖేడ్: మే 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భావి భారత నిర్మాతలైన విద్యార్థులను వేసవి సెలవులలో సమయాన్ని వృధా చేయకుండా మానసిక, శారీరిక వికాసానికి దోహదపడే క్రీడలు, చిత్రకళ,యోగ, సంగీతం, బ్యూటిషన్ తదితర విషయాలలో ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమని నారాయణ ఖేడ్ డీఎస్పీ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నాడు జడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్ సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు అందరూ సెల్ఫోన్ వ్యామోహంలో పడి ఆటపాటలను మరుస్తున్నారని , వారిలో సృజనాత్మకను పెంపొందించేలా ఈ సమ్మర్ క్యాంపు దోహదపడిందన్నారు. గత 15 రోజుల నుండి క్రమశిక్షణతో నేర్చుకున్న విద్యార్థుల ప్రదర్శనలను చూసి వారి ప్రతిభను కొనియాడారు . ఈ సందర్భంగా విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ ప్రశంస పత్రాలను అందజేశారు పిజిహెచ్ఎం మన్మథ కిషోర్, ఉపాధ్యాయులు యాదగిరి, రాజ శేఖర్ అశోక్ గౌడ్, చంద్రశేఖర్ ఆచార్య,డాక్టర్ రాజయ్య,గురునాథ్,ధన్ సింగ్, లీపు ఆర్టిస్టు శివకుమార్ తదితరులు పాలుగోన్నారు.

## కబీర్ కోహినూర్ సమ్మాన్‌కు జామి ప్రసాదరావు ఎంపిక

**మందమర్రి మే 25 (తెలంగాణ వాణి విలేకరి)**
మందమర్రి పట్టణంలో ని సింగరేణి కాలరీస్ పాఠ శాలలో సీనియర్ హిందీ పండితులుగా పనిచేస్తు న్న జామి ప్రసాదరావు జాతీయ ప్రతిష్టాత్మక “కబీర్ కోహినూర్ సమ్మాన్” అవార్డుకు ఎంపికయ్యారు. రాజస్థా న్‌కు చెందిన అఖిల్ భారతీయ కబీర్ మఠం సద్గురు కబీర్ ఆశ్రమ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 629వ కబీర్ జయంతి మహోత్స వంలో భాగంగా ఈ అవా ర్డును ప్రదానం చేయను న్నారు.ఈ



కార్యక్రమం జూన్28, 29, న జరగ నుండగా, హిందీ సాహి త్యానికి విశేష సేవలు అందించినందుకు గాను ఆయనను 5వ జాతీయ పురస్కారం “కబీర్ కోహినూర్” సమ్మాన్‌కు ఎంపిక చేసినట్లు నిర్వాహ కులు తెలిపారు. అదే విధంగా మహోత్సవ కార్యక్రమంలో విద్యా, సామాజిక అభివృద్ధికి తోడ్పడేల జామి ప్రసాద రావు సంపాదకత్వంలో వెలువడిన అనేక పుస్తకాలను ఆవిష్కరిం చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, సాహితీ ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## రైతుల సమస్యలపై అధికారులతో మాట్లాడిన మహాదేవుని శ్రీనివాస్



**కొమురవెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) మే.25**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల పరిధిలో రైతులు వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను ఏపీఎం, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య మరియు సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వెంటనే వడ్ల తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా లారీల కొరత కారణంగా వడ్లు నిల్వలు పేరుకుపోకుండా తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో వడ్లు కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువకాలం నిల్వ ఉండితే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల వెంటనే తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. రైతులు ఎన్నో కష్టాలు పడి పండించిన వడ్లు ఆలస్యమవకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలన్న అదనపుకలెక్టర్




**మెదక్ జిల్లా మే 25:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
సోమవారం రోజునకలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. మెదక్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జూన్ 2 న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. పతాకావిష్కరణ, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల సందేశాలు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమర వీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించేల కార్యక్రమాలను రూపొందించాలన్నారు. స్టేజీ,మైక్ , సౌండ్,త్రాగునీరు,విద్యుత్,పార్కింగ్ లను ఏర్పాటు చేయాలన్నారు.,రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఎదుగుతోందని పేర్కొన్నారు.ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులను కోరారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు.అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ..ట్రాఫిక్, రవాణా ,పార్కింగ్ బందోబస్తు కు పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి ఈ వో ఎల్లయ్యా ,డి ఆర్ ఓ అంబాదాస్ రాజేశ్వర్ డిఆర్డిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గీతం కె.ఎస్.పి.పి.ని సత్కరించిన తెలంగాణ పోలీసు అకాడమీ

**కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ తరపున జ్ఞాపికను స్వీకరించిన రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ అందజేసిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**



**పటాన్ చెరు, మే.25, (తెలంగాణ వాణి రిపోర్టర్):**
వృత్తి పరమైన శిక్షణ, ప్రజా సేవ రంగాలలో 40 ఏళ్ల ఘనమైన సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా, రాజా బహదూర్ వెంకట రామరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ (ఆర్బీవీఆర్ఆర్ టీజీపీఏ) గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం లోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి.)ని ఒక స్మారక చిహ్నంతో సత్కరించింది. హైదరాబాదు లోని తెలంగాణ పోలీసు అకాడమీ ప్రాంగణంలో జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో, తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఈ స్మారక చిహ్నన్ని గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, పూర్వ సంచాలకుడు పి.ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అకాడమీ తాము కొనసాగిస్తున్న విద్యాపరమైన సహకారాలు, సంస్థాగత భాగస్వామ్యాలను గుర్తించి, యునిసెఫ్, ఐఐటీ హైదరాబాదు, జేఎన్టీయూ హైదరాబాదు, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ వంటి పలు ప్రముఖ సంస్థలను కూడా సత్కరించింది. సుపరిపాలన, విధాన విద్య, పరిశోధన, నాయకత్వ అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం వంటి అంశాలను ప్రోత్సహించడంలో విద్యా సంస్థలకు, ప్రజా సేవా సంస్థలకు మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని ఈ కార్యక్రమం ప్రత్యేకంగా చాటి చెప్పింది. సమాజ, సంస్థాగత పురోగతికి దోహదపడే అర్థవంతమైన సహకారాలను పెంపొందించడంలో కె.ఎస్.పి.పి.కి ఉన్న నిబద్ధతను ఈ సన్మానం మరింత బలోపేతం చేసింది.

## సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

**నిర్మల్ - భైంసా: మే 25(తెలంగాణ వాణి ప్రతినిధి)**



సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కుబీర్ మండలం దొడర్నా తండాకు చెందిన సంతోష్‌కు రూ.21,500, కుంటాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన ముస్కు భోజన్నకు రూ.15 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి మంజూరుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి పేర్కొన్నారు.

## పండుగ వాతావరణంలో ఐఎంఎస్ భవనాలకు సీఎం శంకుస్థాపన

- సిరిసిల్ల జిల్లాలో 103 ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణాలకు వర్చువల్ ద్వారా శ్రీకారం
- 13 అంగన్వాడి కేంద్రాలకు (వర్చువల్) ప్రారంభోత్సవం



**రాజన్న సిరిసిల్ల,మే 25 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవనాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి (వర్చువల్) విధానంలో పండుగ వాతావరణంలో శంకుస్థాపన చేశారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవనాల నిర్మాణాలకు (వర్చువల్) విధానంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించగా, రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు,మహిళా సమాఖ్య సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల్లో 103 ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (వర్చువల్) విధానంలో శంకుస్థాపన చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.అలాగే 13 నూతన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి కాగా, వాటిని వర్చువల్ విధానంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**
**నిర్మల్, మే:25(తెలంగాణ వాణి ప్రతినిధి)**




జూన్ 02 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కలెక్టరేట్ లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ను అందంగా అలంకరించాలని చెప్పారు. ప్రధాన వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల కోసం సరిపడినంత సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు.జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానిక అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేసవి క్రీడా శిబిరం ముగింపు వేడుకలు



**మందమర్రి మే 25 (తెలంగాణ వాణి విలేకరి)**
సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా ఆధ్వ ర్యంలో గత 25 రోజులు గా సింగరేణి ఉద్యోగుల పిల్లల కోసం నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిబిరం ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మందమర్రి లోని సి ఇ ఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈ ముగింపు వేడుకలకు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, శిబిరా న్ని విజయవంతం గా పూర్తి చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జీ.ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, గత నెల 4వ తేదీన ప్రారం భమైన ఈ 25 రోజుల శిక్షణ శిబిరంలో విద్యార్థు లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొందడం అభినందనీయమని అన్నారు. చదువుతో పాటు క్రీడలు మానసిక ఉల్లా సానికి, శారీరక దృఢత్వా నికి ఎంతో తోడ్పడతా యని, ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలతో విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధి రోహించాలని ఆకాంక్షిం చారు.మందమర్రి ఏరియా వ్యాప్తంగా ఉన్న నాలుగు ప్రధాన కేంద్రాలలో మొత్తం 160 మంది విద్యార్థులకు నిపుణులైన కోచ్‌లతో విజయవంతంగా శిక్షణ పూర్తి చేయించారు. శిక్షణ ముగిసిన సందర్భం గా క్రీడాకారులకు సర్టిఫికె ట్లను, బహుమతులను అధికారులు అందజేశారు.ఈ ముగింపు వేడుకల్లో ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సి.ఎం.ఓ.ఏ.ఐ ప్రెసిడెంట్ రమేష్, డి జి ఎం పర్సనల్ అశోక్, సీనియర్ ఆఫీసర్ కార్తీక్, ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీనివాస్, ఇతర అధికారులు, యూనియన్ ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా మునీర్ వర్ధంతి వేడుకలు

**మందమర్రి మే 25 (తెలంగాణ వాణి విలేకరి)**
సీనియర్ పాత్రికేయులు ఎం డి. మునీర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించు కొని సోమవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మునీర్ వర్ధంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు, బొడ్డు మల్లేష్, రాంచందర్, గాండ్ల సంజీవ్, బి ఆర్ ఎస్ నాయకులు అబ్బాస్ లు మునీర్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లా డుతూ మునీర్ ఆశయా లను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అని అ న్నారు.కోల్ బెల్ట్ ప్రాంతంలో ప్రజా సమస్య లను వెలుగులోకి తీసుకు వచ్చి పాత్రికేయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మునీర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. పాత్రికేయ వృత్తిని ప్రజాసేవగా భావించిన మునీర్ తన కలం ద్వారా సామాన్య ప్రజల సమస్య లను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నిజాయితీ, నిబద్ధత, ధైర్యసాహసాలతో వార్త లను ప్రజలకు అందిస్తూ యువ పాత్రికేయులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.పేద ప్రజల సమస్యలు, కార్మికుల ఇబ్బందులు, సామాజిక అన్యాయాలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల మన సుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. పాత్రికేయ రంగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయ మని, సమాజం పట్ల ఆయనకున్న అంకిత భావం ఎప్పటికీ మరువ లేనిదని అన్నారు.ఈ కార్యక్రమం లో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాలు

**ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
**ఆదిలాబాద్, మే : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**




మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "మిషన్ శక్తి" మహిళా వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ, భద్రత, ఆరోగ్యం, వారి ఆర్థిక స్వావలంబన సాధించడమే "మిషన్ శక్తి" యొక్క ముఖ్య ఉద్దేశమని, సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా వారోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వారోత్సవాలు నేటి (మే 25) నుండి 30 వరకు జిల్లావ్యాప్తంగా మహిళా చట్టాలు, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, స్వయం ఉపాధి వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు అన్ని రకాల స్కానింగ్‌లు, వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ సెంటర్లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. మహిళలు రక్తహీనతను జయించడానికి నిత్యం ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలన్నారు. అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర ఉండే ప్యాకేజ్డ్, జంక్ ఫుడ్స్ వల్ల చిన్న వయసులోనే బీపీ, డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయని హెచ్చరిస్తూ "సే నో టు జంక్ ఫుడ్" అని పిలుపునిచ్చారు. ఇంట్లో వండుకునే జొన్న రొట్టెలు, సాంప్రదాయ ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో జరిగే అన్ని అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మహిళల్లో ఈ అంశాలపై ఆశా కార్యకర్తలు, టీచర్లు, ఏఎన్ఎంలు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్, అంగన్వాడీ స్టాల్ లను సందర్శించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులకు మెమొంటో లను ముఖ్య అతిథిలు అందజేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి , జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, సంబంధిత శాఖల అధికారులు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీలు, మహిళలు, సఖి కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుదారుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

- పోలీస్ ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహణ.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మే : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ప్రతి సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి ఫిర్యాదుదారులు విచ్చేసి నేరుగా జిల్లా ఎస్పీకి తమ సమస్యలను తెలియజేశారు. విన్న వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా జిల్లా ఎస్పీ బాధితుల సమస్యలను పరిష్కరించడానికి ఆదేశాలను జారీ చేయడం జరిగింది. బాధితుల సమస్యల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసు వ్యవస్థ పై ఉన్న నమ్మకం మరింత పెంపొందించబడుతుందని, ప్రజలలో పోలీసుల పట్ల ఉన్న గౌరవం పెరుగుతుందని తెలిపారు. బాధితులకు అన్యాయం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు ముఖ్య కార్యాలయంలో 32 ఫిర్యాదులను నమోదు కాగా అందులో భార్యాభర్తల సమస్యలు, కుటుంబ సమస్యలు, కేసుల సమస్యలు, భూ సమస్యలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని, ప్రశాంతమైన వాతావరణంలో జిల్లా కొనసాగడానికి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని, వాటిని తుడిచి పెట్టే దిశలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల సమాచారం అయినా 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



## ప్రజావాణిలో 91 దరఖాస్తులు

**ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్ రాజర్షి షా,**

**ఆదిలాబాద్, మే : 25 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం అధికారుల ప్రాధాన్య కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 91 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికలను సమయానికి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.పదేపదే ఒకే సమస్యపై ఫిర్యాదులు రావడం జరుగకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, డిఆర్ఓ స్రవంతి, డీఆర్‌డీవో రవీందర్,డీఏండబ్ల్యూఓ కలీం, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు కానిస్టేబుల్‌లకు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి

**అభినందించిన పోలీసు కమిషనర్**



**నిజామాబాద్ మే 25: (తెలంగాణ వాణి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ గా ఐదుగురు పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా వారు సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ని మర్యాద పూర్వకంగా కలిశారు. గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్నటువంటి కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రమోషన్ పొందినటువంటి హెడ్ కానిస్టేబుల్ లకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు.పదోన్నతి పొందిన వారు బోధన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఎండి. ఖలీద్, పి.సి: 1679,టౌన్ 6 పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న డి. గౌరీ శంకర్, పి.సి:328, నిజామాబాద్. అదేవిధంగా సి.సి.ఆర్.బి లో పీ సీ గా విధులు నిర్వహిస్తున్న బి.శివ కుమార్, పి.సి:28, నిజామాబాద్,నందిపేట్ పోలీస్ స్టేషన్ లో పి సి గావిధులు నిర్వహిస్తున్న బి. దూప్ సింగ్ , పి.సీ:951, నిజామాబాద్, రైల్వే సికింద్రాబాద్ పి ఎస్.లో విధులు నిర్వహిస్తున్న టి శ్రీనివాస్, పి.సి : 1738 వీరు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందారనీ తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైంది

**రైతు గోస.. బీజేపీ భరోసా యాత్రలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



**నిజామాబాద్ మే 25: (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ధాన్యం కొలుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన " రైతు గోస బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా సోమవారం వికారాబాద్ జిల్లా కులకచర్ల మార్కెట్ కమిటీ, గజ్వేల్ ధాన్యం కేంద్రాలను రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎంపీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...45 రోజులు దాటినా గన్నీ బస్తాలు ఇవ్వకుండా , కాంటా పెట్టకుండా, కొన్ని చోట్ల తూకం వేసినా బస్తాలను తరలించేందుకు లారీలు లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదురుకుంటున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరంగల్ సభలో రాహూల్‌గాంధీ రైతు డిక్లరేషన్ పేర అనేక హామీలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. డిక్లరేషన్ పేరుతో హామీలిచ్చి అమ లు చేయని రైతు ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతును కాంగ్రెస్ పార్టీ నిలువునా మోసం చేస్తుందని ఆరోపించారు. మొక్కజొన్న పండించిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందనీ చెప్పారు. రైతుల కష్టాలను పరిష్కరించాల్సిన ప్రభుత్వ పెద్దలు ఏసీ గదులకు పరిమితం అయ్యారని ఆరోపించారన్నారు.

## ప్రజావాణికి 177 ఫిర్యాదులు



**నిజామాబాద్, మే 25 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 177 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి.భుజంగరావుతో పాటు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ బి.గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## ప్రజల ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలి.

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్.**

**హనుమకొండ మే 25 (తెలంగాణ వాణి టౌన్)**



ప్రజా సమస్యలకు ప్రజా ఫిర్యాదులపై అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రతి సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నందు నిర్వహించే ప్రజా ఫిర్యాదులను కార్యక్రమంలో కమిషనరేట్ నలుమూలల నుండి ఫిర్యాదుదారులు తమ సమస్యలను పోలీస్ కమిషనర్ కి స్వయంగా తెలియజేశారు. సమస్యలను విన్న పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి బాధితుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడు పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 6 ఫిర్యాదులను సేకరించడం జరిగింది. వచ్చిన ఫిర్యాదులలో కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, కేసుల పురోగతి, భూ సమస్యలు, తదితర విషయాలు ఉన్నట్లు సీపీ తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా అసంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్న 8712685257 నంబర్ కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

- అద్దె బస్సుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి





**నిజామాబాద్, మే 25 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాన్ని పురస్కరించుకుని మండల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం కేటాయించిన ఆర్టీసీ అద్దె బస్సులను వారికి అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులు, స్కూల్ యూనిఫాంల స్టిచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ళను, రేషన్ కార్డులను కూడా మహిళల పేరిట మంజూరు చేస్తోందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల స్వల్ప కాలంలోనే కేవలం నిజామాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు.రూ. 1100 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. కేవలం మహిళలు అనే కాకుండా అన్ని వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ప్రతిపక్షాలకు ఎంతమాత్రం లేదన్నారు. ప్రజలు కూడా వాస్తవాలను గమనించాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ పిల్లల చక్కటి భవిష్యత్తు కోసం అన్ని వసతులు, నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ బడులలో చేర్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని, తద్వారా అనవసర ఆర్థిక దుబారాను నివారించుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా ప్రజలకు ఆరోగ్యాల పరిరక్షణకు దోహదపడే ఆహార ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మహిళల గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే జిల్లాకు 18 అద్దె బస్సులను కేటాయించిందని తెలిపారు. అద్దె బస్సుల నిర్వహణను పక్కాగా పర్యవేక్షణ జరపాలని సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు నిజామాబాద్ జిల్లాలోనే అత్యధికంగా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరికొత్త ఆలోచనలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే వ్యాపార పరంగా అద్భుత విజయాలు సాధించవచ్చని అన్నారు. నిజామాబాద్ నగరంలో కలెక్టరేట్ కు ఆనుకుని అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం త్వరలోనే అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఏ సాయన్న, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, మండల మహిళా సమాఖ్యల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- మేలు రకం విత్తనాలను వినియోగించాలని రైతులకు పిలుపు

**నిజామాబాద్, మే 25 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మేలైన పంటలు సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఖరీఫ్ సీజన్ ను పురస్కరించుకుని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సరిపడా ఎరువులు, విత్తనాల పంపిణీపై చర్చించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తక్కువ నీటి వినియోగం అవసరం అయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. కేవలం వరి పంటకే పరిమితం కాకుండా జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు. అధిక దిగుబడిని అందించే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని, మేల్ సీడ్ ను వాడవద్దని సూచించారు. ఖరీఫ్ లో జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు




అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు. లారీలు, హమాలీల కొరత, ఎండ తీవ్రత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ రబీలో రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. దిగుబడులు ఆలస్యంగా వచ్చిన బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మినహాయిస్తే, జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తయ్యిందని అన్నారు. బాల్కొండ సెగ్మెంట్ లో సైతం ఒకటి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు.

**యువత కోసం ప్రత్యేకంగా శిక్షణ తరగతులు**

యువత విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా జిల్లా కేంద్రంలోని న్యాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శిక్షణ తరగతుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సాంకేతిక విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు న్యాక్ ద్వారా ప్లంబింగ్, హౌజ్ వైరింగ్, ఫిట్టర్, సెంట్రింగ్, మెసన్, యూనిఫాం స్టిచింగ్ వంటి కోర్సులలో శిక్షణ అందించేందుకు జిల్లా యంత్రాంగం ద్వారా త్వరలోనే ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువరిస్తారని అన్నారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్, మే:25(తెలంగాణ వాణి ప్రతినిధి)**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాల న్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# బైక్ చోరీ కేసు ఛేదించిన భైంసా పోలీసులు

**నిందితుడి అరెస్ట్.. రూ.1.60 లక్షల విలువైన రెండు వాహనాలు స్వాధీనం**

**నిర్మల్-భైంసా:మే 25 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

భైంసా పట్టణంలో ఇటీవల జరిగిన ద్విచక్ర వాహనాల చోరీ కేసును టౌన్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి చోరీకి గురైన రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ తెలిపారు. ఈ నెల 21న ఆటోనగర్ ప్రాంతంలో వేర్వేరు ప్రదేశాల్లో పార్క్ చేసిన పల్సర్,ఫ్యాషన్ ప్రో బైక్‌లు గుర్తుతెలియని వ్యక్తులచే చోరీకి గురయ్యాయి.బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలు,సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు.వాహన తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు మహారాష్ట్ర రాష్ట్రం నాందేడ్ జిల్లా



బుర్బుషం గ్రామానికి చెందిన గుండేవాడ్ రాజుగా గుర్తించారు.మద్యం అలవాటు,కుటుంబ సమస్యల కారణంగా డబ్బుల అవసరం ఏర్పడి ఈ చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల ఆదిలాబాద్ ప్రాంతంలో కూడా బైక్ చోరీ యత్నంలో అరెస్ట్ అయినట్లు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న రెండు వాహనాల విలువ సుమారు రూ. 1.60 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.కేసును వేగంగా ఛేదించిన టౌన్ ఎస్‌హెచ్‌వో టి.సాయి కుమార్, ఎస్ఐ నవనీత్ రెడ్డి,పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.



## నేరెళ్లపల్లిలో భూమి కబ్జాపై ఎమ్మెల్యే ఫిర్యాదు

**కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారన్న పట్టాదారు జమీర్ పాషా**

**బాలానగర్ మే 25 (తెలంగాణ వాణి ప్రతినిది)**

బాలానగర్ మండలంలోని నేరెళ్లపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 42 భూమి కబ్జా జరిగిందంటూ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలపై సోమవారం సర్వేర్ జుబేర్, ఆర్ఐ శ్రీనివాస్, జిపిఓ సాయిలు గ్రామంలోని సర్వే నెంబర్ 42 భూమిని పరిశీలించేందుకు వెళ్లారు. అధికారులను వివరణ అడగగా.. సర్వేనెంబర్ 42 ప్రభుత్వ భూమి అని గ్రామస్తులు ఫిర్యాదు మేరకు.. సర్వే చేయడానికి వెళ్ళామన్నారు. సర్వే చేస్తుండగా



గొడవ కావడంతో సర్వే నిలిచిపోయిందన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత పట్టాదారు జమీర్ పాష మాట్లాడుతూ.. రికార్డుల ప్రకారం.. 1954 సంవత్సరం నుంచి ఈ భూమికి మహమ్మద్ ఖాసిం, యూసుఫ్ మియా, అలీమ్ పాష పట్టాదారులుగా ఉన్నారని, ప్రస్తుతం అలీమ్ పాష కుమారుడు జమీర్ పాష పేరుపై పట్టాదారు హక్కులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సర్వే నెంబర్ పరిధిలో ప్రస్తుతం కుటుంబ సభ్యులకు చెందిన "బొందల గడ్డ" ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టాదారు జమీర్ పాష మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తనను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు రాజకీయంగా ఒత్తిడి తెచ్చే ఉద్దేశంతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సర్వే నెంబర్ 42లో తనకు వారసత్వంగా 1.20 గుంటల భూమి వచ్చిందని చెప్పారు. తన వద్ద అన్ని చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయని, అధికారులే జారీ చేసిన సర్టిఫికెట్లను సర్వే అధికారులకు చూపించినట్లు తెలిపారు. తాను ఎలాంటి భూమి కబ్జాకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ఈ భూమిపై తనకే పూర్తి హక్కులు ఉన్నాయని, హైకోర్టు కూడా తనకు అనుకూలంగా సర్వహక్కులు కల్పించిందని జమీర్ పాష పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.





# ఏఐతో నకిలీ బికినీ ఫొటోలు

## నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫొటో షూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై నటి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఏఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫొటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడి నవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫొటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్‌క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.




# నాగార్జునకు మే 23 స్పెషల్

## తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు

### తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున

అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్ళుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల

## అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అ బి, వ ా న ం ల న ం ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.






# పెళ్లి కారణంగా అవకాశం కోల్పోయా: స్రవంతి

హైదరాబాద్, మే 23: గ్లామర్ రంగంలో మహిళల వ్యక్తిగత జీవితం కూడా కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పెళ్లైందనే కారణంతో ఒక పెద్ద సినిమా అవకాశం కోల్పోయానని ఆమె వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్ ఇచ్చానని, నటన, రూపం పరంగా తనను ఎంపిక చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని తెలిపింది. ఆ పాత్రకు తానే సరైన ఎంపిక అన్న సంకేతాలు కూడా వచ్చాయని చెప్పింది. అయితే చివరి దశ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు అడిగారని స్రవంతి వెల్లడించింది. "నాకు పెళ్లైందా అని అడిగారు. నేను నిజాయితీగా అవునని చెప్పాను. ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి మారిపోయింది" అని తెలిపింది. ముందుగా షూటింగ్ కోసం చెన్నై రావాలని, అడ్వాన్స్ కూడా ఇస్తామని చెప్పారని గుర్తుచేసుకుంది. కానీ పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో తిరిగి కాల్ చేస్తామని చెప్పిన వారు మళ్లీ స్పందించలేదని పేర్కొంది. చివరకు ఆ సినిమా అవకాశం తనకు రాలేదని వెల్లడించింది. తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా నిలిచిపోయిందని స్రవంతి చెప్పుకొచ్చింది. అయితే ఆ సంఘటన తనను మానసికంగా నిరాశపరిచినా, కెరీర్ విషయంలో మాత్రం వెనక్కి తగ్గలేదని తెలిపింది. కష్టపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నానని పేర్కొంది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ స్థాయిలో గుర్తింపు లభించింది. తర్వాత ప్రముఖ రియాలిటీ కార్యక్రమం బిగ్‌బాస్ నాన్‌స్టాప్‌లో పాల్గొని మరింత పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం సినిమా ఆడియో వేడుకలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ బిజీగా కొనసాగుతోంది. మరోవైపు నటిగానూ అవకాశాలు అందిపుచ్చుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో గ్లామరస్ ఫొటోషూట్లతో కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com